క్లుప్తంగా

ఉద్యోగులకు పీఆర్సీ ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కల్హేర్(నారాయణఖేడ్): ఉద్యోగులకు పీఆర్సీ ఇవ్వాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి ఆధ్వర్యంలో సిర్గాపూర్ తహసీల్దార్ మహేంత్‌కుమార్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు రహీం, సంతోష్ కుమార్, పాల్గొన్నారు.

గోతుల పూడ్చివేత



పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ జగ్జీవన్

నారాయణఖేడ్: పట్టణంలోని ప్రధాన రోడ్లపై పడ్డ గోతులు వర్షాలకు మరింత తీవ్రమయ్యాయి. దీంతో 100 రోజుల ప్రణాళికలో భాగంగా గురువారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఆయా గోతులు పూడ్చివేత పనులు చేపట్టారు. ఈ పనులను కమిషనర్ జగ్జీవన్ దగ్గరుండి పర్యవేక్షించారు. గోతులను పూడ్చివేయడంపై వాహనదారులు సంతోషం వ్యక్తం చేశారు. రాంవిలాస్ గల్లీలో మురుగుకాల్వలోంచి తీసిన మురుగు, పూడిక వ్యర్థాలతో చిత్తడిగా మారి రాకపోకలకు ఇబ్బందులు కలుగుతుండటంతో వాటిని ఎత్తేశారు. పలుకాలనీల్లోనూ పారిశుద్ధ్య పనులు నిర్వహించారు.

వంటల్లో నాణ్యత పాటించండి



వంటలు పరిశీలిస్తున్న ఎంపీడీఓ, ఎంపీఓ

కంగ్టి(నారాయణఖేడ్): విద్యార్థులకు వండుతున్న వంటల్లో నాణ్యత పాటించాలని ఎంపీడీఓ శ్రీనివాసులు సూచించారు. గురువారం మండల కేంద్రం కంగ్టిలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో వండిన వంటలను ఆకస్మికంగా ఎంపీఓ సుభాష్‌తో కలిసి పరిశీలించారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. వంట గది పరిశుభ్రంగా ఉంచాలని.. కురగాయలు, ఆకుకూరలు, గుడ్లు, మాంసం తాజాగా ఉన్నవి మాత్రమే వంటలకు వాడాలని తెలిపారు. అనంతరం విద్యాలయంలోని రికార్డును పరిశీలించారు. కార్యక్రమంలో కేజీబీవీ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

కల్హేర్(నారాయణఖేడ్): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కల్హేర్ ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి సూచించారు. గురువారం విలేకరులతో మాట్లడుతూ.. మరో రెండు రోజులు కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. అత్యవసరమైతే తప్ప బయటకి రావద్దన్నారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లల్లో ఎవరు ఉండొద్దని చెప్పారు. మత్స్యకారులు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు షార్ట్ సర్క్యూట్ వచ్చే అవకాశం ఉన్నందున వాటికి దగ్గరగా మనుషులు వెళ్లొద్దని, పశువులను కూడా వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎవరైనా ఆపదలో ఉంటే డయల్ 100కి ఫోన్ చేస్తే సహాయాన్ని అందిస్తారని తెలిపారు.

అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న డా.కల్పన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): జాతీయ ఫైలేరియా, నులిపురుగుల నిర్మూలనలో భాగంగా గురువారం బండ్లగూడ పరిధి పెన్నార్ పరిశ్రమలోని సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డా. కల్పనా పాల్గొని ఫైలేరియాపై అవగాహన కల్పించారు. ఆగస్టు 10 నుంచి 25 వరకు ఫైలేరియా, నులి పురుగుల నిర్మూలన కోసం ప్రభుత్వం ఉచితంగా మందులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

చీరల పంపిణీ

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం సిరిపురంలో గురువారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. గ్రామంలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో అన్నదానం నిర్వహించి, అనంతరం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు యాదయ్య, పోచయ్య,అనితయాదవ్, సురేష్‌రావు,అశోక్, భాషయ్య, నరేందర్ పాల్గొన్నారు.

వంగతోట.. లాభాల బాట

మార్కెట్‌లో మంచి డిమాండ్
- కిలో వంగకాయ ధర రూ.40
- సస్యరక్షణ చర్యతో సత్ఫలితాలు



కంబాలపల్లిలో సాగు చేస్తున్న వంకాయ తోట

జహీరాబాద్ టౌన్: టమాట సాగు చేసి దిగుబడి వచ్చినా ధర లేక తీవ్రంగా నష్టపోయిన రైతులను వంకాయ ఆదుకుంటుంది. అందుకే అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. చీడపీడలు తట్టుకునేలా సరికొత్త వంగడాలు సాగుచేస్తే లాభాల పంట పడుతుందని ఉద్యాన శాఖ అధికారులు పేర్కొంటున్నారు. జిల్లాలోని జహీరాబాద్, సంగారెడ్డి, సదాశివపేట, కోహీర్, గుమ్మడిదల, కొండాపూర్, హత్నూర మండలాల్లో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉంది. సుమారు 1.10 లక్షల మెట్రిక్ టన్నుల ఏటా కూరగాయల పంటలు సాగవుతుంది. ఇందులో టమాట, వంకాయ అధిక విస్తీర్ణంలో పండిస్తున్నారు. వంకాయకు ఎప్పుడు డిమాండ్ ఉంటుంది. రైతులు పండించిన కూరగాయలను పట్టణాల్లోని సంతలో విక్రయిస్తుంటారు. హైదరాబాద్‌కు తరలిస్తుంటారు. కూరగాయల సాగును అధికారులు కూడా ప్రోత్సహిస్తున్నారు. ఫలితంగా సాగు విస్తీర్ణం అధికంగా ఉంది. ప్రస్తుతం మార్కెట్‌కు వంకాయ వస్తుండగా ధర కూడా గిట్టుబాటు అవుతుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సాగు సమయం

వంకాయను వర్షకాలంలో జూలై నుంచి ఆగస్టు, చలికాలంలో నవంబర్–డిసెంబర్, వేసవిలో ఫిబ్రవరి నుంచి మార్చి మొదటి వారంలో నారును నాటాలి. సంకరజాతి వంకాయ విత్తనాలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. నర్సరీల నుంచి మేలైన రకం నారు తీసుకుని నాటాలి. సారవంతమైన మురుగు నీరు పోయేలా సౌకర్యం కలిగిన అన్ని రకాల నేలల్లో పండుతుంది. నేలను 4–5 సార్లు బాగా దున్ని చదునుచేయాలి. వర్షాకాలం పంటకు బోదెలు, కాలువలు ఏర్పాటు చేయాలి. చలికాలం, వేసవి పంటకు 4–5 చ.మీ మళ్లను తయారు చేయాలి.

పంట సాగు విధానం

పొడవుగా నిటారుగా పెరిగే రకాలకు 60–60 సెం.మీ, గుబురుగా పెరిగే రకాలకు 75–50 సెం.మీ దూరంలో నాటాలి. ఎకరాకు 200 కిలోల వేప పిండిని దుక్కిలో వేసుకోవాలి. బాక్టీరియా ఎండు తెగులు ఉండే ప్రాంతాల్లో ఎకరాకు 6 కిలోల చొప్పున బ్లీచింగ్ పొడిని వేసుకోవాలి. రసం పీల్చే పురుగు రాకుండా ఎకరానికి 10 కిలోల చొప్పున కార్బోఫ్యూరాన్ గుళికలను నాటే ముందు వేయాలి. ఆఖరి దుక్కిలో ఎకరాకు 2–4 టన్నుల బయో మిక్చర్ వేసి కలియదున్నాలి. నాటిన 30 నుంచి 60 రోజుల్లో 24 కిలోల పొటాష్ 40 కిలోల నత్రజని, 200 కిలోల అమ్మోనియం సల్ఫేట్ లేదా 85 కిలోల యూరియా మూడు భాగాలు చేసి మూడు సార్లు వేయాలి.

వంకాయ సాగుతో నష్టం లేదు



మార్కెట్‌లో వంకాయలకు మంచి డిమాండ్ ఉంది. శుభకార్యాల సమయం కావడంతో లాభాలు వస్తున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో రూ. 40 పలుకుతుంది. ఈ ధరకు సంతలో విక్రయిస్తే 40 కిలోలకు రూ. 1200 ఆదాయం వస్తుంది. ఇంకా ధర పెరిగే అవకాశం ముంది. ఖర్చులు పోనూ ఎకరాకు రూ. 50 వేల వరకు మిగులుతుంది.

–శ్రీనివాస్, రైతు, కంబాలపల్లి

వరిసాగులో యూరియా తగ్గించాలి



వరిపైరును పరిశీలిస్తున్న ఏడీఏ నూతన్‌కుమార్

కల్హేర్(నారాయణఖేడ్): వరిసాగులో యూరియా వాడకం తగ్గించాలని ఏడీఏ నూతన్‌కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని కృష్ణాపూర్‌లో వరి పంటను పరిశీలించారు. పైపాటుగా కాంప్లెక్స్ ఎరువులు వాడవద్దని సూచించారు. మొక్క ఎదుగుదల కోసం దుక్కిలో మాత్రమే డీఏపీ లేదా సింగిల్ సూపర్ ఫాస్పేట్‌ను వాడాలన్నారు. 4 దఫాలుగా యూరియా వాడాలని వేసినప్పుడు 25 కేజీలు మాత్రమే వేయాలని, ఎక్కువ వాడితే అధికంగా యూరియా వేస్తే తెగుళ్లు వస్తాయని వివరించారు. వరి నారుమడి దశలో కొన్ని చోట్ల నాట్లు వేసే దశలో ఉన్నందున వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు సూచనలు పాటించాలన్నారు. పెట్టుబడి తగ్గించుకునేందుకు మార్కెట్‌లో నానోడీఏపీ, నానో యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. అనంతరం బీబీపేట్ పీఏసీఎస్‌లో ఎరువుల స్టాక్ పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ వెంకటేశం, ఏఈఓ కృష్ణావేణి పాల్గొన్నారు.

అభివృద్ధి, ప్రజాసంక్షేమం లక్ష్యం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి



చెక్కుల పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

నారాయణఖేడ్: అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. నాగల్‌గిద్దకు చెందిన గోపాల్‌కు రూ.54 వేలు సీఎం సహాయనిధి ద్వారా మంజూరయ్యాయి. సిర్గాపూర్ మండలం గోసాయిపల్లికి చెందిన సుమలతకు కల్యాణలక్ష్మి, అదేగ్రామానికి చెందిన సాలె వీరమణికి సీఎం సహాయనిధి నుంచి ఆర్థిక సహాయం మంజూరయింది. గురువారం సంబంధించిన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పేదలకు మెరుగైన వైద్యం అందించాలని రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచడంతో పాటు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. మనూరు పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్, మాజీ సర్పంచ్ యాదవరెడ్డి, నాయకులు నారాయణజాదవ్, నెహ్రూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు గురువారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. మండలంలోని అనేగుంట, సత్వార్, బూచినెల్లి, రాయిపల్లి(డి), అల్గోల్, చిరాగ్‌పల్లి, దిడ్గి, బుర్దిపాడ్ గ్రామాలకు చెందిన రేణుక, పద్మావతి, జయప్ప, రూబెన్, భాగమ్మ, ముబీన్, హఫీజ్, రాజు తదితరులకు రూ.4.30 లక్షల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ, నాయకులు అమిత్ కుమార్, మశ్చేందర్, హీరూ రాథోడ్, శంకర్, పర్వేజ్, వీరొట్టి, రాజు, కిష్టయ్య అశోక్ పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

జహీరాబాద్: బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు ఎల్‌ఓసీలను అందజేశారు. గురువారం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అనారోగ్యంతో బాధపడుతున్న హోతి(బి) గ్రామానికి చెందిన కిష్టమ్మకు మెరుగైన వైద్యం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికింద రూ.2లక్షల ఎల్‌ఓసీ, అల్లీపూర్ గ్రామంలోని ఫ్రెండ్స్ కాలనీకి చెందిన అబ్దుల్ రవూఫ్‌కు రూ.1.50 లక్షల ఎల్‌ఓసీని అందజేశారు. ఈ మేరకు బాధితులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు తట్టు నారాయణ, మశ్చేందర్, వెంకటేశం, నర్సింహాగౌడ్, సురేష్, అబ్దుల్లా, శంకర్‌పటేల్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న నాయకులు

న్యాల్‌కల్(జహీరాబాద్): త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలు కైవసం చేసుకునేలా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని బీజేపీ నాయకులు ద్వారక రవి, మల్లేశ్ గంగ్వార్ అన్నారు. గురువారం మండలంలోని హద్నూర్‌లో మండల పార్టీ అధ్యక్షుడు మల్లేశ్ ఆధ్వర్యంలో ఎన్నికల వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రం ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. ప్రస్తుతం బీజేపీకి ప్రజల్లో మంచి ఆదరణ ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు జగన్, ఓంకార్ యాదవ్, రాహుల్, విష్ణు, శ్రీధర్, వీరారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, అరుణ్, శ్రీనివాస్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ భవిష్యత్ ఆశాకిరణం

ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు



నేతలతో కలిసి కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే

జహీరాబాద్: మాజీ మంత్రి కేటీఆర్ భవిష్యత్ తెలంగాణ ఆశాకిరణం అని ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు అన్నారు. గురువారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో కేటీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాణిక్‌రావు కేక్ కట్‌చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసి, తెలంగాణ బ్రాండ్‌ను విశ్వవ్యాప్తం చేసిన కేటీఆర్ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆయా మండలాల పార్టీ అధ్యక్షుడు తట్టు నారాయణ, సంజీవరెడ్డి, వెంకటేశం, పీఏసీఎస్ చైర్మన్ మచ్చేందర్, బీఆర్‌ఎస్ నాయకులు బండి మోహన్, మొహియొద్దీన్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



శుభ్రత పనులను పరిశీలిస్తున్న కమిషనర్

జిన్నారం (పటాన్‌చెరు): వర్షాకాలం సిజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు కోమలి, నిర్మలా రెడ్డిలు వైద్య సిబ్బందికి సూచించారు. గురువారం గడ్డపోతారం, బొల్లారం పట్టణ పరిధిలో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశాల్లో వారు వేర్వేరుగా మాట్లాడారు. అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన సూచనలను వైద్య సిబ్బందికి వివరించారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకునేలా చూడాలన్నారు. నీరు నిల్వ ఉన్న ప్రదేశాలను గుర్తించి వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్లు, వెంకటరామయ్య, కిషన్, కార్యాలయ అధికారులు, వైద్య సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు సన్మానం



రామకృష్ణను సన్మానిస్తున్న ఎంఈఓ శంకర్

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): పర్యావరణ పరిరక్షణ విభాగంలో రాష్ట్రస్థాయి పురస్కారాన్ని అందుకున్న మండలంలోని నిజాంపూర్(కే) ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం రామకృష్ణను గురువారం ఎంఈఓ శంకర్, కాంప్లెక్స్ హెచ్‌ఎం రాజశ్రీ శాలువాతో ఘనంగా సన్మానించి, అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో విద్యాభివృద్ధికి హెచ్‌ఎం రామకృష్ణ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా

మునిపల్లి(అందోల్): 50 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయాధికారి అంజలి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని తాటిపల్లికి 50 మెట్రిక్ టన్నుల యూరియా ఆయా షాపుల్లో నిల్వ ఉందన్నారు. అవసరమైన రైతులు ఆధార్ కార్డు తీసుకుని వెళ్తే ఇస్తారని తెలిపారు. ఎక్కువ ధరకు అమ్మితే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం ధర రూ.266.60 పైసలుందన్నారు. కొనుగోలు చేసిన రైతులు రశీదు తప్పకుండా తీసుకోవాలని సూచించారు.

సంగారెడ్డి డీటీగా విజయ్‌కుమార్

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి మండలం డిప్యూటీ తహసీల్దార్‌గా విజయ్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన డిప్యూటీ తహసీల్దార్ నరేష్ రైకోడ్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెవెన్యూ సమస్యలను పరిష్కరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు.

ఢిల్లీ యూనివర్సిటీకి విద్యార్థి ఎంపిక

ఝరాసంగం(జహీరాబాద్): ప్రతిష్టాత్మకమైన ఢిల్లీ యూనివర్సిటీలో మండల వాసి ప్రవేశం పొందాడు. మండలంలోని కంబాలపల్లి గ్రామానికి చెందిన నరేస్ కేంద్ర విశ్వవిద్యాలయ ప్రవేశ పరీక్ష సీయూసెట్–2025లో ఉత్తమ ప్రతిభను కనబర్చాడు. ఈ సందర్భంగా కంబాలపల్లి గ్రామస్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు నరేష్‌ను అభినందిస్తూ గ్రామం నుంచి ఢిల్లీ యూనివర్సిటీలోకి విద్యార్థి ఎంపిక కావడం గర్వకారణమని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పశువులకు లంపీ వైరస్ నిరోధక టీకాలు

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని సర్దార్ తండాలో గురువారం పశువులకు టీకాలు ఇచ్చినట్లు అసిస్టెంట్ వెటర్నరీ సర్జన్ డాక్టర్ ముస్తాకలీ తెలిపారు. ఇటీవల కాలంలో పశువులకు లంపీ వైరస్ సోకి చర్మం పొలుసుగా మారి ఊడిపోతుందన్నారు. ఈవైరస్ సోకకుండా పశువులకు ముందస్తుగానే టీకాలు ఉచితంగా ఇస్తున్నట్లు ముస్తాక్‌అలీ తెలిపారు. సర్దార్‌తండాలో 120 పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు. మండలంలోని రైతులందరూ ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'పంచగవ్య' మిశ్రమంతో పంటకు బలం



ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు

జహీరాబాద్: పంచగవ్య సేంద్రియ మిశ్రమం పంటకు ఎంతో బలాన్ని ఇస్తుందని, ఇది వ్యవసాయంలో సంప్రదాయ పద్ధతులలో ఉపయోగించే ఒక సేంద్రియ మిశ్రమం. దీని తయారీకి ఆవుపేడ, ఆవు మూత్రం, పాలు, పెరుగు, నెయ్యితో పాటు బెల్లం, లేత కొబ్బరి నీరు, అరటిపండ్లు వంటి ఇతర పదార్థాలను కలిపి తయారు చేస్తారు. వీటిని కలిపి ఒక నిర్దిష్ట కాలానికి, సాధారణంగా 30 రోజులు క్రమం తప్పకుండా కలుపుతూ పులియబెట్టాలి. అనంతరం ఇది పంటలకు వాడుకునేందుకు ఉపయోగపడుతుంది.

పంచగవ్య తయారీపై అవగాహన

పంచగవ్య తయారీ, దీని వల్ల పంటలకు ఉపయోగాల గురించి గురువారం మండలంలోని హుగ్గెల్లి గ్రామంలో గ్రామీణ వ్యవసాయ పని అనుభవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు లక్ష్మీకాంత్, జగదీష్‌లు ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మల్లారెడ్డి విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థులు అఖిల్, జితిన్, గౌతమ్, కార్తీక్, కౌశిక్, హితేష్‌లు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందేలా చర్యలు

మంత్రి దామోదర రాజనర్సింహ



ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి

మునిపల్లి(అందోల్): ప్రజలకు సత్వరమే మెరుగైన వైద్యం అందించేందుకు 20, 25 కిలో మీటర్లకు ఒకటి చొప్పున ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. గురువారం రాత్రి మునిపల్లి మండలం కంకోల్ చౌరస్తా 65వ నంబర్ జాతీయ రహదారి సమీపంలో నిర్మిస్తున్న 30 పడకల ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ ఆస్పత్రి వినియోగంలోకి వస్తే సుమారు 24 గ్రామాల ప్రజలకు ఉపయోగపడుతుందన్నారు. అనంతరం మండల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగారం గొల్ల అంజయ్య, మాజీ ఎంపీపీ రాంరెడ్డి, రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్లు సుధాకర్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, డీసీసీబీ సభ్యులు శేరి జగన్ మోహన్, సురేందర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ దుర్గయ్య, ఇంజినీరింగ్ అధికారులు, మండల పార్టీ అధ్యక్షులు సతీష్ కుమార్, మండల నాయకులు పాల్గొన్నారు.

ప్రతిపాదనలు సిద్ధం చేయండి

రాయికోడ్(అందోల్): మండలంలోని చిమ్నాపూర్–కుసునూర్ గ్రామాల మధ్య వాగుపై నూతన వంతెనను నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి దామోదర అధికారులకు సూచించారు. మండలంలోని చిమ్నాపూర్, సింగితం గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. చిమ్నాపూర్‌లో అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుకు భూ కేటాయింపు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సింగితం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణం పనులను పరిశీలించి పనుల నిర్వహణలో వేగం పెంచాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయాల సంస్థల చైర్మన్ అంజయ్య, నాయకులు నర్సింలు, కేధారినాథ్, సతీష్‌కుమార్, ప్రభాకర్, వీరేశం, రవికుమార్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ రుద్రహోమం పూజలు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీలోని వీరన్నగూడెం భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయంలో అమావాస్యను పురస్కరించుకొని గురువారం అర్చకులు రుద్రహోమ పూజలను ఆలయ కమిటీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. శాస్త్రోక్తంగా నిర్వహించిన పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

◆ పేద విద్యార్థులను ప్రోత్సహించాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పేద విద్యార్థులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని భారతినగర్ డివిజన్ కార్పొరేటర్ వి.సింధూరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు మాజీమంత్రి కేటీఆర్ పుట్టినరోజు సందర్భంగా నియోజకవర్గం బీఆర్‌ఎస్ కోఆర్డినేటర్ వి.ఆదర్శ్‌రెడ్డి ఆధ్వర్యంలో భూమి.. ఆకాశం ఓర్ఫనేజ్ ట్రస్ట్ సహకారంతో నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం పదవ తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు.

◆ ఆర్‌ఐటీఐలో దరఖాస్తుల ఆహ్వానం

హత్నూర (సంగారెడ్డి): మండల కేంద్రమైన హత్నూరలోని ఆర్‌ఐటీఐలో పలు కోర్సుల్లో చదవడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుబ్బలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌ఐటీఐలో రెండవ విడతలో పలు కోర్సుల్లో ఖాళీలు ఉన్నట్లు ఆమె పేర్కొన్నారు. పదవ తరగతి పూర్తి చేసిన అభ్యర్థులు ఆయా కోర్సుల్లో చేరడానికి 31 లోపు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

◆ కేతకీలో అమావాస్య సందడి

ఝరాసంగం(జహీరాబాద్): కేతకీ సంగమేశ్వర ఆలయంలో అమావాస్య సందడి నెలకొంది. గురువారం అమావాస్యను పురస్కరించుకని తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ఆవరణలోని అమృత గుండంలో పవిత్ర పుణ్య స్నానాలు ఆచరించి, గుండంలోని జలలింగానికి పూజలు చేశారు. అనంతరం గర్భగుడిలోని పార్వతీపరమేశ్వరులను క్యూలైన్లలో వేచి ఉండి దర్శించుకున్నారు.

◆ విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

కొండాపూర్(సంగారెడ్డి): మాజీ మంత్రి కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని బీఆర్‌ఎస్ నాయకులు పడమటి అనంత్‌రెడ్డి గురువారం గుంతపల్లిలో ఘనంగా పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేసి సంబురాలు జరిపారు. మునిదేవునిపల్లి నుంచి గొల్లపల్లి గ్రామానికి చదువుకోవడానికి వెళ్లే 18 మంది విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అనంత్‌రెడ్డి మాట్లాడుతూ.. సమయానికి బస్సులు రాకపోవడంతో విద్యార్థినులు చదువు నిమిత్తం ఇతర గ్రామాలకు నడుచుకుంటూ వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. విద్యార్థుల కోసం బస్సులు నడపాలని కోరారు.

◆ విద్యార్థులకు బూట్లు పంపిణీ

వట్‌పల్లి(అందోల్): మండలంలోని కేరూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు బురగళ్ల కుమార్ ఆధ్వర్యంలో 70మంది విద్యార్థులకు ఉచితంగా బూట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థుల విద్యాభ్యాసానికి తో డ్పాటునందించాలనే సంకల్పంతో షూ పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అరుణకుమారి, మాజీ సర్పంచ్ సత్యనారాయణగౌడ్, నాయకులు ప్రభాకర్, వెంకట్‌గౌడ్, మాణిక్యం, యాదగిరి, రమేశ్ పాల్గొన్నారు.

◆ డంపింగ్ యార్డును తొలగించాలి

సంగారెడ్డి టౌన్ : పట్టణంలోని చెత్తను తీసుకొచ్చి పసల్వాది గ్రామశివారులో పారేస్తున్నారని గురువారం గ్రామస్తులు నిరసన తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని పసల్వాది శివారులో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్‌లో చెత్త వేసేందుకు వెళ్లిన ఆటోలను అడ్డుకున్నారు. జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన తెలుపడంతో ఘటన స్థలానికి పోలీసులు, మున్సిపల్ కమిషనర్ వచ్చారు. దుర్వాసన వస్తుందని రీసైకిలింగ్ చేయకుండా కుప్పలుగా వేయడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. కమిషనర్ మాట్లాడుతూ రెండు నెలల సమయంలో చెత్తను వాసన రాకుండా రీసైక్లింగ్ చేపిస్తామని హామీ ఇచ్చారు.

డంపింగ్ యార్డును తరలించండి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్ కాలనీ సమీపంలోని డంపింగ్‌యార్డుతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారని పట్టణ బీజేపీ అధ్యక్షుడు ఆనంద్ కృష్ణారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం మున్సిపల్ కమిషనర్ కిషన్‌ను స్థానికులతో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం చెత్తసేకరణ వాహనాలను స్థానికులు అడ్డుకున్నారు. వెంటనే స్పందించిన కమిషనర్ కిషన్ వారితో మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు. డంపుయార్డుతో స్థానికంగా దుర్వాసన ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డంపు యార్డును మరోచోటికి తరలించి తమ ఆరోగ్యాలను కాపాడాలని లేనిపక్షంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గాంధీనగర్ ప్రజలు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు దరఖాస్తులు

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం గుండ్లమాచునూర్‌లోని ఆదర్శ పాఠశాలకు అనుబంధంగా పనిచేస్తున్న బాలికల వసతి గృహంలో తాత్కాలిక పద్ధతిలో పనిచేయుటకు సిబ్బంది కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జయలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హాస్టల్ కేర్ టేకర్, హెడ్‌కుక్, అసిస్టెంట్ కుక్, ఏఎన్‌ఎం, వాచ్‌మేన్, అటెండర్ పోస్టులకు తాత్కాలిక పద్ధతిలో పనిచేయుటకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పదవ తరగతి నుంచి డిగ్రీ బీఎడ్ చదివిన మహిళ అభ్యర్థులు మాత్రమే 31 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.